చల్లదనానికి చాప చుట్టేశారు!

- వట్టి వేరు చాపలు వాడే వారు కరవు
- ఏసీలకే ప్రాధాన్యం ఇస్తున్న జనం
- కూలర్లలో ఉపయోగిస్తున్న వైనం


వట్టి వేరు చాపలు తయారు చేస్తున్న మహిళలు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న వట్టి వేరు చాపలు

సామర్లకోట: పట్టణంలో ఒకప్పుడు వట్టివేర్ల చాపల తయారీకి మంచి డిమాండ్ ఉండేది. పనులు లేని సమయంలో వేసవి కాలంలో అనేకమంది ఈ చాపల తయారీతో ఉపాధి పొందేవారు. అయితే వట్టివేర్ల చాపలకు ఆదరణ తగ్గి పోవడంతో వాటిని తయారు చేసే వారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. వర్షాలు ప్రారంభం కావడంతో వాటి తయారీకి స్వస్తి పలికారు. పట్టణంలో కుటీర పరిశ్రమగా వట్టి వేర్ల చాపల తయారీ జరిగేది. సుమారు 12 కుటీర పరిశ్రమలలో 200 మంది వరకు పని చేసేవారు. అయితే దీని వాడకం తగ్గిపోవడంతో తయారు చేసే కుటీర పరిశ్రమలు కూడా మూత పడ్డాయి. వేసవి కాలం ప్రారంభం అయిన వెంటనే ఈ వట్టివేరు చాపలను ఇళ్ల గుమ్మాలకు, బాల్కనీ, కిటికీల వద్ద వేలాడ దీసుకునేవారు. దాంతో ఆయా గదులలో మంచి సువాసన భరితమైన వాతావరణంలో పాటు చల్లదనం ఉండేది. బ్యాంకులలో ఎక్కువగా ఈ వట్టి వేరు చాపలు కనిపించేవి. అయితే వీటి వాడకం క్రమేపీ తగ్గుతోంది. ఈ వట్టి వేరు చాపలకు నీళ్ల చల్లుతూంటే సువాస భరితమైన చల్లని గాలి వస్తుంది. దీంతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుంది. కూలర్లలో వాడే ఇతర చాపలకు కొంతకాలం తరువాత బ్యాక్టీరియా చేరి, ఆరోగ్యానికి హాని చేయడమే కాకుండా దుర్వాసన కూడా వస్తుంది. దాంతో కూలర్లలో కూడా వట్టి వేరు చాపలను ఉపయోగిస్తున్నారు. దాంతో ఎక్కువ కాలం మన్నిక ఉండటమే కాకుండా దుర్వాసన రాకుండా ఉంటుంది.

తగ్గిన అమ్మకాలు

వట్టి వేర్లను ముక్కలుగా తయారు చేసి వాటిని చాపలుగా అల్లుతారు. ఈ చాపల తయారీలో ఎక్కువగా మహిళలు ఉంటారు. తయారు చేసిన చాపలను కూలర్లు తయారు చేసే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇటీవల కాలంలో కూలర్లు వాడకం తగ్గి, ఏసీలకు ప్రాధాన్యం ఇవ్వడంతో వట్టివేరు చాపల అమ్మకాలు తగ్గిపోయాయి. వాటిపై ఆధారపడి జీవించేవారి ఉపాధి లేకుండా పోతోంది. అడుగు రూ.16 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఆరు–నాలుగు, ఆరు–మూడు సైజులు తయారు చేస్తున్నారు. వినియో గదారులు వారికి కావలసిన సైజుల ఆర్డర్లు ఇస్తే చాపలు తయారు చేస్తారు. వట్టి వేరు నుంచి తీసిన నూనెతో మర్దన చేయడం వల్ల ఒంటి నొప్పులు మట్టు మాయం అవుతాయని పెద్దలు చెబుతారు. భూమి కోతలను అరికట్టడానికి, భూసారాన్ని పరిరక్షించడానికి కూడా వట్టి వేర్లు ఎంతగానో ఉపయోగ పడతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు.

మరో వృత్తి చేయలేక..



వంశ పారంపర్యంగా 50 ఏళ్లుగా వట్టివేరు చాపల తయారీపై ఆధారపడి జీవిస్తున్నాం. మరో వృత్తి చేసే అవకాశం లేకపోవడంతో చాపలను తయారు చేస్తున్నాం. వృద్ధులు, చిన్నపిల్లలు ఉండే గదులకు వట్టివేరు చాపలు వాడాలని డాక్టర్లు సూచించడంతో కొంతమంది చాపలను కొనుగోలు చేస్తున్నారు. కూలర్ల తయారీ కంపెనీల ఆర్డర్ల మేరకు చాపలు తయారు చేస్తున్నాం. ఇటీవల ఆ ఆర్డర్లు కూడా తగ్గిపోయాయి.

– రాజు, వట్టివేరు చాపల తయారీదారుడు, సామర్లకోట

యువత మాదక ద్రవ్యాల జోలికిపోవద్దు


మాదక ద్రవ్యాలపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పెద్దాపురం: యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎక్సైజ్ ఎస్‌ఐ ఏవీవీ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో స్థానిక లూథరన్ హైస్కూల్ నుంచి ఆదివారం మాదక ద్రవ్యాల నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువతను రక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, మాదక ద్రవ్యాలకు దూరంగా యువతను ఉంచాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. లూథరన్ హైస్కూల్ హెచ్‌ఎం పిలిప్పురాజు, సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కబ్జా కోరల్లో చెరువులు


కొత్తపల్లిలో ఆక్రమణకు గురైన ముత్యాలమ్మ చెరువు

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో చెరువులకు ఇరువైపులా ఉన్న గట్లు ఆక్రమణకు గురవుతున్నాయి. కొందరు కబ్జాదారులను చెరువు గట్లను యథేచ్ఛగా ఆక్రమించి రాత్రికి రాత్రే షాపులు నిర్మిస్తున్నారు. పంచాయతీ అధికారులు సైతం అక్రమంగా నిర్మించిన షాపుల్లో విద్యుత్ సరఫరాకు అనుమతుల పత్రాలను జారీ చేస్తున్నారు. ముఖ్యంగా కొత్తపల్లిలోని ముత్యాలమ్మ చెరువు, ఊర చెరువు, గొర్స, కొమరగిరి, ఉప్పాడ మార్కెట్ సమీపంలోని చెరువులను ఆక్రమించి షాపుల నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ పంచాయతీ, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అక్రమంగా నిర్మించిన షాపులకు ఇప్పటివరకు అధికారులు ఒక్క నోటీసు కూడా ఇచ్చిన పాపానపోలేదు. అధిక మొత్తంలో సొమ్ములు అధికారులకు ఆశ చూపి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న షాపులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫొటో స్టూడియోలో చోరీ


చోరీ జరిగిన బాలాజీ ఫొటో స్టూడియో

పెద్దాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న సాయిబాబా ఆలయం పక్కన గల బాలాజీ ఫొటో స్టూడియోలో ఆదివారం వేకువ జామున చోరీ జరిగింది. పట్టణంలోని సత్యవరపు దుర్గారావు ఆదివారం ఉదయం స్టూడియో తెరిచేసరికి విలువైన కెమెరాలతో పాటు పది వేల రూపాయల నగదు అపహరణకు గురైనట్లు యజమాని గుర్తించి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక


ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించనున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రతీ వారం నిర్వహించే గ్రీవెన్స్‌లో భాగంగానే ఈ వారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరిస్తామన్నారు. డివిజన్ పరిధిలోని 11 మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

7న మాదిగ జన జాతర


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సామర్లకోట: జూలై 7వ తేదీన నిర్వహించనున్న మాదిగ జన జాతరను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ ఆవిర్భవించిన ఈదుమూడిలో జనజాతర నిర్వహిస్తున్నట్టు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వల్లూరి నాని తెలిపారు. ఈ మేరకు ఆదివారం భీమవరపు కొత్తపేటలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సీనియర్ నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మాదిగ జన జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాని, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం ఎంఆర్‌పీఎస్ పోరాటం చేస్తోందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు నందిక చక్రం, ఎంఆర్‌పీఎస్ నాయకులు వేళంగి సత్తిబాబు, శీల సూర్యారావు, చెన్నా రాజు, పైడి రాజు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులో చేపల వేట నిషేధించాలి

సామర్లకోట: ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్న చెరువుల్లో చేపల వేటను నిషేధించాలని కౌన్సిలర్ నేతల హరిబాబు డిమాండ్ చేశారు. వారం రోజులుగా ఉండూరు రైల్వే గేటు సమీపంలో ఉన్న నాగార్జున ఫిల్టరు చెరువులో చేపల వేట సాగుతున్నా అధికారులు మౌనం వహించడం వింతగా ఉందన్నారు. చెరువులో నీరు కలుషితం కావడం వలన ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మండల పరిధిలో వేట్లపాలెం గ్రామంలో అతిసార వ్యాధి వ్యాప్తి చెందగా ఇప్పటికైనా అధికారులు స్పందించాలన్నారు. ఈ మేరకు హరిబాబు మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు చేపల వేటను నిషేధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

జీవితాన్ని కష్ట జీవులకు అంకితం చేసిన సూర్యారావు


యాసలపు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగతాయారు

పెద్దాపురం: తన జీవితాన్ని కష్ట జీవులకు అంకితం చేసిన వ్యక్తి యాసలపు సూర్యారావు అని పెద్దాపురం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అన్నారు. యాసలపు సూర్యారావు 12వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో కవితా గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జ్యోస్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో ఆమె మాట్లాడుతూ సూర్యారావు అందరి మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచేపోయే వ్యక్తిగా మిగిలారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్, జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ, సాహితి స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ ప్రతి కథలోనూ, కవితలోనూ ప్రజల జీవన చిత్రాలు కనబడతాయన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రతీ కవిపై ఉంటుందన్నారు. అనంతరం కవితాగోష్ఠి నిర్వహించారు. కొత్త శివ, దాడి బేబి, బుద్ధా శ్రీనివాస్, నీలపాల సూరిబాబు, కేదారి నాగు, యాసలపు రమేష్, .రవి, బంగార్రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త


పులిమేరులో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ బాలామణి

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి అన్నారు. మండలంలోని పులిమేరు గ్రామంలో మంచినీటి సరఫరా తీరును ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ బాలామణి మాట్లాడుతూ వాతావరణ మార్పులను బట్టి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. తాగునీటి వల్ల వచ్చే వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు ట్యాంకులను పరిశుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. అనంతరం గ్రామంలో మంచినీటి సరఫరా విధానంపై ఆరా తీశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రమణ, సచివాలయ ఇంజినీరింగ్ అధికారి ప్రసన్నకుమార్ ఉన్నారు.

అప్రమత్తమైన జనం


పీబీ దేవంలో వాటర్ ట్యాంకుల క్లీనింగ్


వేట్లపాలెంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ శ్యామ్‌సుందర్

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం గ్రామంలో అతిసార వ్యాధి విజృంభించడంతో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తం అవుతున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించే పని ప్రారంభించారు. పీబీ దేవం గ్రామ పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్ ఆధ్వర్యంలో ట్యాంకులను శుభ్రం చేయించి గ్రామంలో బ్లీచింగ్ పిచికారీ నిర్వహించారు. ప్రజలు తాగునీటిని వేడిచేసి చల్లార్చి తాగాలని సూచించారు. ఈ మేరకు గ్రామంలో దండోరా వేయించినట్టు తెలిపారు. హుస్సేన్‌పురం గ్రామ నాయకుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ట్యాంకులను శుభ్రం చేయించారు.

పారిశుధ్య పనులపై శ్రద్ధ చూపాలి

సామర్లకోట: పారిశుధ్య పనులపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ అన్నారు. ఆదివారం సాయంత్రం వేట్లపాలెం గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో అతిసార వ్యాధి అదుపులోకి రాక పోవడంతో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి కేటాయించారు. డ్రైనుల్లో పూడికతీయడంతో పాటు బహిరంగ మలవిసర్జన లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి, హెల్త్ సిబ్బందికి ఎంపీడీఓ పలు సూచనలు చేశారు.

క్రీడాస్ఫూర్తికి ఒలింపిక్ రన్


సామర్లకోట మెహర్ కాంప్లెక్స్ నుంచి ఒలింపిక్ రన్



ఒలింపిక్ రన్‌లో పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

సామర్లకోట: విద్యార్థులలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడం కోసం ప్రతీ ఏడాది ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నట్లు ఒలింపిక్ జోన్ కన్వీనర్ తాళ్లూరి వైకుంఠం అన్నారు. స్థానిక మెహర్‌కాంప్లెక్స్ నుంచి ఆదివారం ఒలింపిక్ రన్ ప్రారంభం అయింది. 1894 జూన్ 23వ తేదీన ఏథెన్స్‌లో ఒలింపిక్ గేమ్స్ ప్రారంభం అయిన సందర్భంగా ప్రతీ ఏడాది జూన్ 23న ఒలింపిక్ రన్ నిర్వహించి ఒలింపిక్ ప్రాధాన్యం తెలియజేస్తున్నామన్నారు. కాకినాడ జిల్లాను మూడు జోన్‌లుగా విభజించి ఒలింపిక్ రన్ జరిగిందని చెప్పారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ మాట్లాడుతూ సామర్లకోటలో క్రమం తప్పకుండా రెండు దశాబ్దాలుగా ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నామన్నారు. వర్షం పడటంతో స్థానిక అన్నపూర్ణ కల్యాణ మంటపం వద్ద ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కౌన్సిలర్ బలుసు వాసు, పీఈటీ నిమ్మకాయల స్వాతి, వీరబాబు, ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, కె.శ్రీనివాసు, బ్రహ్మన్న, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ కౌన్సిలర్ బడుగు శ్రీకాంత్‌లు పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.


వాకతిప్ప గ్రామ సచివాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు


సామర్లకోట-కాకినాడ రోడ్డులో గూడ్స్ షెడ్ వద్ద రోడ్డుపై నిలిచిపోయిన నీరు

హోరువాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రహదారులపై నిలిచిన నీరు


పిఠాపురం -ఉప్పాడ రోడ్డులో కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద నిలిచిపోయిన వర్షపునీరు

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటలకు పైగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పిఠాపురం– ఉప్పాడ రోడ్డులోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద, ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో డ్రైన్లు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ఆయా ప్రాంతాల్లో నీరు నిలిచిపోతోంది. దీంతో ఆయా మార్గాల్లో వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వర్షాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులు ఖరీఫ్ సాగు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ వర్షం ఉద్యాన, ఖరీఫ్ పంటలకు మేలు చేస్తుందని అధికారులు తెలిపారు.

మూసుకుపోయిన రంధ్రాలతో రోడ్లపై నీరు

సామర్లకోట: ఆదివారం తెల్లవారు జామున కురిసిన కొద్దిపాటి వర్షానికే అనేక ప్రాంతాలలో రోడ్లపై నీరు నిలిచిపోయింది. సామర్లకోట-కాకినాడ కెనాల్ రోడ్డులో మాండవ్యనారాయణస్వామి ఆలయం రైల్వే గూడ్స్ షెడ్, ఐదు తూముల వద్ద రోడ్లపై వర్షపు నీరు గోదావరి కాలువలోకి పోవడానికి రంధ్రాలు ఏర్పాటు చేశారు. ఆ రంధ్రాలు వర్షాలు వచ్చిన సమయంలో చేరిన మట్టితో పూర్తిగా మూసుకుపోయాయి. దాంతో కొద్దిపాటి వర్షం కురిసినా వర్షపు నీరు పాయే మార్గం లేక రోడ్లపై నిలిచిపోతోంది. దాంతో భారీ వాహనాలు రాకపోకల సమయంలో చిన్న వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న వాహన చోదకులపై భారీ వాహనాలు బురద నీళ్లు చిమ్ముతున్నాయి.

అధ్వానంగా పారిశుధ్యం


కొత్తపల్లిలో పేరుకుపోయిన చెత్త


వాకతిప్పలో ప్రధాన రహదారికి చెంతనే వ్యర్థాలు

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. గ్రామాల ముఖద్వారాల వద్ద చెత్తకుప్పలు, వ్యర్థాలు ప్రజలకు స్వాగతం పలుకుతున్నాయి. డ్రైన్లు పూడుకుపోవడంతో మురికినీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ముఖ్యంగా కొత్తపల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొండెవరం, యండపల్లి గ్రామాల్లో పారిశుధ్యం మరింత అధ్వానంగా ఉంది. చెత్త, వ్యర్థాలను వీధులు, రోడ్లపైనే వేస్తున్నారు. వర్షపునీరు చేరడంతో ఆయా ప్రదేశాలు మురికికూపాలుగా మారుతున్నారు. దీంతో దోమలు పెరిగిపోయి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్త తొలగింపు

సామర్లకోట: మండల పరిధిలో ఆయా గ్రామాల్లో కంపోస్టు యార్డుల్లో చెత్త పెరిగిపోతే వాటిని శుభ్రం చేయించాలని పంచాయతీ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్టు ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పి.వేమవరం గ్రామంలో కంపోస్టు యార్డులో చెత్త పెరిగిపోవడంతో దానిని జేసీబీ సహాయంతో తొలగించే కార్యక్రమం ప్రారంభించామన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్న కారణంగా గ్రామాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు.


పి.వేమవరం గ్రామంలో కంపోస్టు యార్డులో చెత్త తొలగింపు

నేడు మరిడమ్మ అమ్మవారి హుండీల లెక్కింపు


పెద్దాపురం మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయ హుండీలను సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ రామ్మోహనరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జాతర ఉత్సవాల్లో భాగంగా ఏటా జాతర ప్రారంభంలో హుండీల లెక్కింపు ఉంటుందన్నారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ చైర్మన్, ఆసాదులు, భక్తుల సమక్షంలో హుండీలను లెక్కించనున్నట్లు చెప్పారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన


వాకతిప్పలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప కాపుల రామాలయం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కొత్తపల్లికి చెందిన ముత్యాలమ్మతల్లి కోలాట భజన మండలి ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శించారు. వీరికి శివరామకృష్ణ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలు ప్రదర్శించిన కోలాటానికి వీక్షకులు ఆకర్షితులయ్యారు.